సాక్షి 24|7

తూర్పుగోదావరి

సోమవారం

13-1-2014


# ఉగాది నాటికి మెట్రో రైలు అందుబాటులోకి

## వినియోగంలోకి రానున్న 8 కిలోమీటర్ల రూటు

- మొత్తం 72 కిలోమీటర్ల మేర పనులు
- ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి వెల్లడి



అనపర్తి, న్యూస్‌లైన్ : వచ్చే ఉగాది నాటికి హైదరాబాద్‌లో మెట్రో రైలు అందుబాటులోకి వస్తుందని ఆ ప్రాజెక్టు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఉగాది నాటికి ఎనిమిది కిలోమీటర్ల మార్గాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే మూడు రూట్లలో తొలి దశగా 2017 నాటికి 72 కిలోమీటర్ల మేర ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. మెట్రో రైలు మార్గంలో మూడు గమన మార్పు కూడళ్లతో కలిపి 63 ప్రాంతాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 66 స్టేషన్లు నిర్మితమవుతాయని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైలు అంచనా వ్యయం రూ.14,132 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.1458 కోట్లు, ఎల్‌అండ్‌టీ సంస్థ రూ.12,674 కోట్లు సమకూరుస్తున్నాయని చెప్పారు. అదనపు ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1980 కోట్లు సమకూరుస్తున్నదన్నారు. 50 లక్షల జనాభా గల నగరాల్లో ఈ తరహా ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ముంబై నగరంలో కూడా త్వరితగతిన మెట్రో రైలు ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతామన్నారు. 20 లక్షల జనాభా గల నగరాల్లో కూడా ప్రాజెక్టులు నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. విశాఖ, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.